ప్రజాశక్తి
మంగళవారం 1 ఏప్రిల్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ఘనంగా రంజాన్ వేడుకలు

కందుకూరులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిములు

'సోమశిల' ఆప్రాన్ నిర్మాణం ఎప్పుడో..!

సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్ నిర్మాణం మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా వచ్చి పరిశీలించి హామీ ఇచ్చినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. గత పాలకులు నిర్లక్ష్యంగా కారణంగా ఎన్నో ఏళ్ల నుంచి సరైన నిర్వహణ లేకపోవడం, ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో దెబ్బతింది. ప్రతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లలో నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు, వరదలు రానుండడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సోమశిల ప్రాజెక్టులో ఆప్రాన్ బాగా దెబ్బతింది. కనీసం నిధులు ఇవ్వకపోవడంతో ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే కేంద్ర నిపుణుల కమిటీ ప్రాజెక్టును సందర్శించి ఇప్పటికే పలు సూచనలు చేసింది. అది గతంలో బుట్టదాఖలు చేశారు. రూ.98 కోట్లు విలువైప పనులు కొంత చేసి పక్కన పెట్టేశారు. ప్రస్తుతం ఆప్రాన్ కోసం రూ.80 కోట్లు, గేట్లు నిర్వహణ కోసం రూ.2.5 కోట్లు , కండలేరు కరకట్టల కోసం రూ.16 కోట్లు అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇది ఇస్తామని ప్రస్తుత పాలకులు చెప్పారు. కార్యరూపం దాల్చడం లేదు.

- ఎనిమిది నెలల క్రితం హామీ
- నిధుల విడుదలలో జాప్యం
- జిల్లా రైతాంగంలో తీవ్ర ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లాకు సోమశిల, కండలేరు ప్రాజెక్టులు జిల్లాకు వరం. జిల్లా రైతాంగం సాగునీటి , ప్రజల తాగునీటి సమస్యలు తీరుతున్నాయి. ప్రస్తుతం సోమశిల 78 టిఎంసిల సామర్థ్యంతో ఉంది. కండలేరులో 68 టిఎంసిలు. ప్రతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లలో భారీ వర్షాలు, వరదలు వస్తాయి. సోమశిలకు 12 గేట్లు ఉన్నాయి భారీగా వర్షాలు వచ్చినప్పుడు అన్ని గేట్లు తీసి పెన్నాకు నీరు విడుదల చేస్తున్నారు.. 2022లో ఏకంగా ఐదు లక్షల క్యూసెక్కులు నీరు సోమశిల నుంచి కిందకు విడుదల చేశారు. ఈ సమయంలో ప్రాజెక్టుకు ముందుబాగంలో ఆప్రాన్ పూర్తిగా దెబ్బతింది. పెన్నా పరివాహక ప్రాంతాల్లో వరద నీరు వచ్చి భారీగా నష్టపోయారు. అటు తరువాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్రాన్ నిర్మాణానికి రూ. 98 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు సుమారు రూ.22 కోట్లు విలువైన పనులు చేశారు. ప్రాజెక్టు ముందు బాగాన సిమెంట్, కమ్మితో కొంత పనులు చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులు సగంలోనే నిలిపేసి వెళ్లిపోయారు. ప్రాజెక్టు బలంగా ఉండాలంటే కీలకమైనది ఆప్రాన్ , డ్యామ్ ముందుబాగాన బలంగా నిర్మాణం చేస్తారు. ఇనుము, కాంక్రీట్ తో నిర్మాణం చేస్తారు. గేట్లు ద్వార నీరు కిందకు వదిలినప్పుడు ఇసుక, మట్టి కొట్టుకుపోకుండా ఆప్రాన్ నిర్మాణం నిలుపుదల చేస్తుంది. ఇదే ఇప్పుడు ప్రమాదంగా మారింది. దీనిని పూర్తిగా నిర్మాణం చేయకపోతే ప్రాజెక్టు ఉనికే ప్రమాదం. జూలై 13న రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమశిల, కండలేరు ప్రాజెక్టులను సందర్శించారు. ప్రమాదాన్ని గుర్తించి వెంటనే పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అందుకోసం అవసరమైన నిధులు సిఎంతో మాట్లాడి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆప్రాన్ నిర్మాణానికి రూ.80 కోట్లు అవసరం ఉంటుందని చెప్పారు. కండలేరు ప్రాజెక్టులు బహీనంగా ఉండడంతో వాటి నిర్మాణానికి రూ.16 కోట్లు, సోమశిల గేట్లు మరమ్మతులకు రూ.2.5 కోట్లు అవసరమని చెప్పారు. ఆగస్టు 18 ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టు సందర్శించి నిర్మాణం చేపడుతామని ప్రకటించారు...

సోమశిల ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న ఆప్రాన్

రైతాంగం ఎదురుచూపు..!

సోమశిల ప్రాజెక్టుకు 12 గేట్లు ఉన్నాయి. వీటికి నిత్యం గ్రీస్ పూయడంతోపాటు, మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఐదేళ్లపాటు ఒక్క రూపాయి గేట్లు మరమ్మతుల కోసం ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అనేక చోట్ల గేట్లు తుప్పుపట్టిపోవడం, ఇనుప వైర్లు దెబ్బతిన్నాయి. నిత్యం గ్రీస్ వినియోగించి గేట్లు తీయాలి. అనేక రోజులుగా ఆ పని చేయలేదని తెలిసింది. దీంతో ప్రాజెక్టులోని అనేక గేట్లు రోప్స్‌కు తుప్పు పట్టింది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి తెలిపారు. వెంటనే మరమ్మతులు చేసి, ఆప్రాన్ నిర్మాణంతోపాటు, గేట్లు, రోప్స్ మరమ్మతులు చేయాల్సి లేదంటే పెను ప్రమాదమేనని అధికారులు చెబుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేటు తెగిపోయిన తరువాత సోమశిల పరిస్థితి చూస్తే ఇక్కడ ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే సోమశిల ప్రాజెక్టుకు ప్రమాదం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆగస్టు 18న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమశిల వచ్చి అక్టోబర్‌లో ఆప్రాన్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సిఎం స్వయంగా చెప్పడంతో వెంటనే పనులు జరిగిపోతాయని ఆశపడ్డారు. ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఆప్రాన్ పరిస్థితి ఉంది. మళ్లీ వరదలు వచ్చేలోపు ఈ పనులు పూర్తి చేయకపోతే ప్రాజెక్టుకు తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడు చేస్తారో చూడాలి.

వక్ఫ్ బిల్లుపై సిఎంతో చర్చిస్తున్నాం..

ఎపి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

ప్రజాశక్తి -నెల్లూరు

రంజాన్ సందర్భంగా నగరంలోని బారాషహీద్ దర్గా లోని ఈద్గా ఆవరణలో జరిగిన ఈద్ కి నమాజ్ లో ఎపి వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి కోసం ప్రపంచ హితం కోసం 30 రోజులు కఠోర ఉపవాస దీక్షలు ఉండి ప్రపంచ దేశాలన్నీ ప్రజల కోసం ప్రార్థనలు చేశాయన్నారు.. ప్రపంచంలో మతకలహాలు ఎక్కువైపోయా యని, ఒకరి వ్యక్తిగత జీవితాల్లో మరొకరి జోక్యం ఎక్కువైపోయిందని పేర్కొన్నారు. వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లు పై చంద్రబాబుతో చర్చిస్తున్నామని, ముస్లిం సమాజంపై ఈగ కూడా వాలకుండా చూసుకునే బాధ్యత టిడిపి చూసుకుంటుందన్నారు. ముస్లింలను రక్షించుకునే బాధ్యత చంద్రబాబు నాయుడు తీసుకుంటారని అన్నారు. చంద్రబాబుతో మరోసారి మాట్లాడి వక్ఫ్ అమ్మెండ్మెంట్ బిల్ గురించి కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావాలో తీసుకొస్తామని భరోసా కల్పించారు.

బారా షాహిద్ దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న అబ్దుల్ అజీజ్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-కందుకూరు

రంజాన్ పండుగ పట్టణంలో ఘనంగా జరిగింది. ముస్లిములు మసీదులు, ఈద్గాల వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. హిందూ, ముస్లిములు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు : రంజాన్ వేడుకలు గుడ్లూరులో సోమవారం ఘనంగా జరిగాయి. బిసి కాలనీలో ఉన్న మసీదు దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

మాజీ మంత్రి 'కాకాణి'కి మళ్లీ నోటీసులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతనిధి : మాజీ మంత్రి ,వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పోలీసులు మళ్లీ నోటీసులు అందజేశారు. సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసానికి వెళ్లిన పొదలకూరు పోలీసులు మరో మారు నోటీసులు అందజేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు నెల్లూరు రూరల్ డిఎస్‌పి కార్యాలయం వద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. ఆదివారం నోటీసులు అందజేసి 31వ తేదీన హాజరు కావాలని కోరారు. 31న హైదరాబాదు నుంచి ఆయన రాకపోవడంతో తిరిగి మళ్లీ మరో మారు సోమవారం నోటీసులు అందజేశారు. గత వారం రోజుల నుంచి పొదలకూరు మైనింగ్‌కు సంబంధించి నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయనను అదుపులోకి తీసుకుంటారని ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో తన మనవడి జన్మదిన వేడుకల నిమిత్తం కాకాణి హైదరాబాదుకు వెళ్లారు. హైదరాబాదుకు వెళ్లి నోటీసులు అందజేయడం పట్ల వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి ప్రభుత్వం కావాలని కాకాణి పట్ల కక్షసాధింపు చర్యలకు దిగుతుందని విమర్శించారు. నేడు కాకాణి డిఎస్‌పి ఎదుట హాజరవుతారా లేదా అన్నది ఉత్కంఠ నెలకొంది.

కృష్ణంరాజును సన్మానిస్తున్న దృశ్యం

ఆర్‌టిసి ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు డిపోలో ఉద్యోగ విరమణ చేసిన ఎస్ కృష్ణంరాజుకు వీడ్కోలు కార్యక్రమం సెక్యూరిటీ ,హెడ్కానిస్టేబుల్ సుందరం ఆధ్వర్యంలో సోమవారం సన్మానం జరిగింది. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ శ్యామ్‌ప్రసాద్, మెకానికల్ అసిస్టెంట్ మేనేజర్ రాజ్యలక్ష్మి, హనుమంతరావు, ఎర్నింగ్ డి.సి లక్ష్మమ్మ..ఎ.డి.సిలు ఎల్. ఎస్.వాసులు, బెజవాడ మాల్యాద్రి, ఆర్‌టిసి, విశ్రాంత ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ ఉమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో నూతనంగా ఏర్పడిన స్కందపురి సేవాసమితి, శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ బొమ్మ , డిపో సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే చలివేంద్రాలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం చలివేంద్రాలను ఏర్పాటు చేయటం జరుగుతుందని, ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు సేవ చేయాలని సభ్యులకు ఎంఎల్ఎ శ్రీ సూచించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కంద్రా మాల్యాద్రి, స్కందపురి సేవా సమితి సభ్యులు పువ్వాడి మౌనిక, అఖిల, నేహా, విగ్నేష్, వేణు సురేష్ నాగేశ్వరరావు కష్ణ మహేంద్ర మల్లేష్, మనోహర్, రాము, మురళి అయ్యప్ప సేవ సంఘం సభ్యులు మురళి, వెంకటేశ్వర్లు, శ్రీను, ఉన్నం వీరాస్వామి, కాటా చెంచురామయ్య ఉన్నారు.

పట్టణంలోని పెద్ద బజారులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పబ్బిశెట్టి వరదరాజ, నల్లమల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బోణాల శ్రీనివాస చక్రవర్తి వారి తండ్రి చెంచు కిష్టయ్య జ్ఞాపకార్థం బోణాల శ్రీనివాస చక్రవర్తి కుటుంబ సభ్యులు మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ చలివేంద్రాన్ని కందుకూరు సిఐ వెంకటేశ్వరరావు మీదుగా సోమవారం ప్రారంభించారు. సిఐ వెంకటేశ్వరరావు చేతులమీదుగా మజ్జిగ పంపిణీ చేశారువెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తి ని తీర్చడం ఓ మంచి కార్యక్రమమం అన్నారు.. శ్రీనివాస చక్రవర్తి కుటుంబ సభ్యులను సిఐ అభి నందించారు. ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొత్తూరి సుధాకర్, ఆర్యవైశ్య కన్వీనర్ మురారిశెట్టి సుధీర్ కుమార్, ఇస్కాల సురేంద్ర, కంకణాల వెంకటేశ్వర్లు, తాతా లక్ష్మణ , చేదెళ్ల శ్రీనివాసులు, కోట కిషోర్,కాకుమాని ప్రవీణ్, అనుమాలశెట్టి శ్రీకాంత్, ఇస్కాల శ్రీనివాసులు, కొలపర్తి సురేంద్ర, కనుమర్లపూడి శివరామకష్ణ, గుర్రం శ్రీనివాసులు ఉన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ

గుడ్లూరులో ట్రాఫిక్ చిక్కులు..!

ఆక్రమణలతో కుచించుకుపోయిన మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి -గుడ్లూరు : మండల కేంద్రమైన గుడ్లూరు మెయిన్ బజార్లో ట్రాఫిక్ చిక్కులు తొలగలేదు. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిం చకపో వడంతో గంటల తరబడి వాహనచోదకులు నిరీక్షిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం సమయంలో మెయిన్ బజార్లో ట్రాఫిక్ జామ్ నెలకొంటుంది. అత్యవసర పనుల మీద వెళ్లాల్సిన వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ చిక్కులను తొలగించేందకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని జనం పెదవివిరుస్తున్నారు. మెయిన్ బజారులోని వ్యాపారులు ఆక్రమణల వల్ల తరచూ ఈ ట్రాఫిక్ నెలకొంటుంది. గ్రామ పంచాయతీ లేఅవుట్ ప్రకారం 40 అడుగులు ఉండాల్సిన రహదారి 20 అడుగులకు కుంచించుకుని పోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. గుడ్లూరు బస్టాండ్ సెంటర్ నుంచి శివాలయం వరకు అర కిలోమీటర్‌కు పైగా ఈ గుడ్లూరు మెయిన్ బజార్ మొత్తం ఆక్రమణలతో నిండి పోయింది. వ్యాపారులు పోటా పోటీగా దుకాణాలను ముందుకు జరిపి సైడు కాలువల మీద వస్తువులు పెట్టడం వల్ల మెయిన్ బజార్లో కొన్ని సెంటర్లలో 15 అడుగులకి రహదారి తగ్గిపో యింది. ఈ సమస్యపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు గత 20 ఏళ్లగా వినతిపత్రాలు అందజేస్తున్నా ప్రజల దగ్గర తీసుకున్న వినతిపత్రాలు బుట్టదాఖలయ్యాయి. దీంతో వ్యాపారులు తమ దుకా ణాలను విస్తరిస్తున్నారు. రోడ్డు రవాణా సంస్థ వారు జిల్లా సర్వేయర్ మెయిన్ బజార్‌లో కొలతలు వేశారు. అక్రమ కట్టడాలు ఎంతవరకు తొలగించాలో మార్కింగ్ వేశారు. దీంతో కంగారుపడిన వ్యాపారులు స్థానిక ఎంఎల్‌ఎకు మొరపె ట్టుకున్నారు. దీంతో రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ చిక్కులు యథా విధిగా ఉన్నాయి. బస్టాండ్ సెంటర్, గాంధీ బొమ్మ గ్రంథాలయం, పాత పశువుల వైద్య కేంద్రం దగ్గర 60 అడుగులు రహదారి ఉండేందుకు వీలుగా అప్పట్లో అధికారులు కేటాయించారు. అక్కడ ఖాళీగా ఉన్న స్థలాలను సైతం ఆక్రమించుకొని వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. ముడుపులు అందుకున్న కొందరు అధికారులు ఆక్రమణలను తొలగించకుండా కాలాన్ని నెట్టుకొచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. గుడ్లూరు నుంచి కావలికి వెళ్లే రహదారిలోనూ ఆక్రమణల జోరు కొనసా గుతోంది. రహదారికి ఇరువైపులా వ్యాపార సంస్థలు వెలుస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి మెయిన్ బజార్లో ట్రాఫిక్ చిక్కులను తొలగించాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఆక్రమణల కారణంగా కుచించుకుపోయిన ప్రధాన రహదారి

గుడ్లూరులో ట్రాఫిక్ సమస్య ఇలా..

రహదారి విస్తరణ పనులు చేపట్టాలి : సిపిఎం

గుడ్లూరు పరిసర గ్రామాల నుంచి నిత్యావసరాలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేయడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి నిరంతరం ప్రజలు గుడ్లూరుకు వస్తుంటారు. దీంతో గుడ్లూరు మెయిన్ బజారు రద్దీగా ఉంటుంది. వ్యాపార కేంద్రాలన్నీ గుడ్లూరు మెయిన్ బజార్లో ఉండటం వల్ల ప్రజల తాకిడి ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గుడ్లూరు మెయిన్ బజార్ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కూరగాయల ధరలు తగ్గాయి..!

రైతులకు నష్టాలు.. వినియోగదారులకు ఆనందం..

ప్రజాశక్తి-కందుకూరు

కూరగాయల ధరలు మార్కెట్లో తగ్గుదలతో వినియోగదారులు సంతోషిస్తుండగా వాటిని పండించే రైతులు విలపిస్తున్నారు. గత వారం రోజులుగా కూరగాయలు ధరలు బాగా తగ్గుముఖం పట్టాయి. టమాటా ధరలు అయితే గడచిన రెండు నెలలుగా వినియోగదారులకు పూర్తి అందు బాటులోకి వచ్చాయి. గతంలో కేజీ రూ. 40 నుంచి రూ. 55 వరకు ఉన్న టమోటాలు క్రమక్రమంగా కేజీ రూ. 15 నుంచి 18కి చేరాయి. దీంతో కందుకూరు ప్రాంతంలో టమోటా పండించిన రైతుల కంట కన్నీరు కనిపిస్తుంది. కందుకూరు ప్రాంతంలోని ఓగూరు ,బొంతవారిపాలెం గ్రామాలలో టమాటా సాగుచేసిన రైతులకు కేజీ రూ. 5 నుంచి పదిలోపే గిట్టడంతో కోత కూలి కూడా రావట్లేదని తోటలు వదిలేశారు. టమోటాలు ధరలు బాగా తగ్గడంతో వినియోగదారులు వాటిని ఎక్కువ మోతాదులో కొనుగోలు చేస్తున్నారు.

ప్రస్తుతం కందుకూరు మార్కెట్లో గత నెల రోజులుగా కేజీ రూ. 18కే వస్తున్నాయి. ఇక వంకాయలు ధర కేజీ 25 రూపాయలకు పడిపోయింది. వారం రోజుల కిందటి వరకు వంకాయల ధర కేజీ 40 నుంచి రూ. 50ఉంది. ఇక బెండకాయల ధర అయితే కేజీ రూ. 25 మాత్రమే ఉంది. నిన్న మొన్నటి వరకు కేజీ రూ. 30 అమ్ముతున్న పచ్చిమిర్చి ప్రస్తుతం రూ. 26 వచ్చింది. కేజీ 60 నుంచి రూ. 70 వరకు ఉన్న కాకరకాయలు ప్రస్తుతం రూ. 30 పడిపోయింది. రూ. 40 నుంచి రూ. 60 పలుకుతున్న బీరకాయల ధర కేజీ రూ. 37 కు చేరింది.గతంలో ప్రజలకు ఏమాత్రం అందుబాటులో లేని బీన్స్ ధర ప్రస్తుతం కేజీ 55 రూపాయలకు అమ్ముతున్నారు. వంద రూపాయలు ఉన్న క్యారెట్ ,బీట్రూ ధరలు 26 నుంచి 30 రూపాయలు పలుకుతున్నాయి. క్యాలీఫ్లవర్ కేజీ 45 రూపాయలు. అయితే గత రెండు నెలలుగా కేజీ 30 లోపే అమ్ముతున్నారు. దోసకాయల ధర మాత్రం ఎప్పుడు రూ25 -20 మధ్య ఉంటూ వస్తుండగా ఇప్పుడు కేజీ 35 రూపాయలు పలుకుతున్నాయి. గోరుచిక్కుళ్ళు కేజీ 32 రూపాయలకే వస్తున్నాయి. సొరకాయ 20 రూపాయలు, పొట్లకాయ కేజీ 30 రూపాయలకి అమ్ముతున్నారు. మునగకాయలు కేజీ 45 రూపాయలకు మార్కెట్లో వినియోగదారులకు అమ్ముతున్నారు. కూరగాయలు కొంత తగ్గటంతో వినియోగదారులు ఆనంద పడుతుండగా రైతులు మాత్రం గిట్టుబాటు కావడం లేదని కంట కన్నీరు పెడుతున్నారు. కందుకూరు ప్రాంతంలో కూరగాయలు దిగుబడి వచ్చే సమయానికి ధరలు మరింత తగ్గటంతో ఏడాదికాడాదికి సాగు తగ్గిస్తున్నారు. ఈ సంవత్సరం కూరగాయల సాగు చేసిన రైతులు మరింత నష్టాలను చవిచూస్తున్నట్లు వారు చెబుతున్నారు.



74 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి -నెల్లూరు

జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 74 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 3916 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.సోమవారం అర్ధరాత్రి తో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కార్య కలాపాలు ముగుస్తాయన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట తరువాత రబీ సీజన్ కు సంబంధించిన కొనుగోలు ప్రక్రియ ప్రారంభించ బడుతుందన్నారు

'బుర్రా'ను కలిసిన 'మర్లపాటి'

ప్రజాశక్తి-కందుకూరు : వైసిపి నెల్లూరు జిల్లా ఎంప్లాయిస్ ,పెన్షనర్స్ వింగ్ అధ్యక్షులుగా నియమితులైన మర్లపాటి ఆదామ్ సోమవారం మాజీ శాసన సభ్యులు, కందుకూరు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధు సూదన్ యాదవ్‌ని కలిశారు. తనకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బుర్రాను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్యకర్తలతో 'బుర్రా' భేటి

కందుకూరులోని వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌తో భేటి అయ్యారు. వివిధ రాజకీయం అంశాలు చర్చకు వచ్చాయి. నియోజక వర్గంలోని వైసిపి నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

తేనేటి విందుకు 'ఇంటూరి' హాజరు

ప్రజాశక్తి-కందుకూరు : రంజాన్ పండుగ సందర్భంగా పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ సలాం ఆహ్వానం మేరకు వారి ఇంటి వద్ద జరిగిన తేనేటి విందు కార్యక్రమానికి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు హాజరైనారు.ముందుగా సలాం కుటుంబ సభ్యులకు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్ ,వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీనివాసరావు ఉన్నారు.

ధాన్యం విక్రయాల్లో రైతుల అవస్థలు

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలంలోని చిమిడిదిపాడులో ధాన్యం పండించిన రైతన్నల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో నెల్లూరు నుంచి వస్తున్న ప్రైవేటు వ్యక్తులకు ధాన్యాన్ని అమ్ము కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం కింటాకు గ్రేడ్-1కు రూ. 2, 320 ధర నిర్ణయించగా ప్రైవేటు వ్యక్తులు క్వింటాకు రూ. 2.000 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. 75 కేజీల బస్తాకు ఐదు కేజీల ఐదు కేజీల ధాన్యాన్ని తరుగు రూపంలో తొలగించడం వల్ల బస్తాకు రూ. 120 నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. అసలే గిట్టుబాటు లేక ఇబ్బందులు పడుతుంటే తరుగుల రూపంలో నష్టపోతున్నామని చెబుతున్నారు. ఒక రైతు సుమారుగా 30 నుంచి 40 బస్తాలు ఇస్తే రూ.5 వేల నుంచి 6 వేల వరకు తరుగు రూపంలో నష్టపోతున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సుమారుగా ఒక బస్తాకు రూ. 150 నష్టపోతున్నామంటున్నారు. ప్రభుత్వం వైపు నుంచి తమకు ఎటువంటి సహాయం అందడం లేదని, ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అధికారులు ఎవరు రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కింటాకు రూ. 320 ధర నష్టం వస్తుందంటున్నారు. తరుగు రూపంలో రూ. 120, నష్టం మొత్తంగా రూ. 440 క్వింటాకు నష్టం వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వమే రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘ నాయకుడు దామ కిష్టయ్య. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



'విక్రమ్' స్కూల్లో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-అల్లూరు : అల్లూరులోని విక్రమ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఉగాది సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వంశీ మాట్లాడుతూ బోధనతో ఉపాధ్యాయులు చెప్పే సబ్జెక్టులపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విక్రమ్ హై స్కూల్లో క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యా బోధనను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉగాది పండుగ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ప్రాముఖ్యతను పాఠశాల సిబ్బంది విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులకు, సిబ్బందికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ వంశీతోపాటు ప్రిన్సిపల్ లక్ష్మీకాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఏపి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది పండుగ సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఆదివారం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉగాది పచ్చడి విశిష్టతను వివరించారు. ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, నిత్య అన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, ఆపస్ కార్యవర్గ సభ్యులు పట్నం అనిల్ కుమార్, ఆర్వి రమణారెడ్డి, కృష్ణారెడ్డి, పెంచల రెడ్డి, రాఘవరెడ్డి, వెంకు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి-కావలి : ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణంపై సమగ్రమైన విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ కావలి పట్టణంలోని క్రైస్తవ సంఘాలు ఆదివారం సాయంత్రం పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఇది హత్యనా.. లేక ప్రమాదమా.. అనే విషయాన్ని తేల్చాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని "ఐ లవ్ యు కావలి" సెల్ఫీ పాయింట్ వద్ద నుండి ప్రధానమైన రోడ్ ఉదయగిరి బ్రిడ్జి కూడలిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ నిరసన కార్యక్రమంలో కావలి పట్టణంలోని వివిధ క్రైస్తవ సంఘాల బాధ్యులు, పాస్టర్లు, మహిళలు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై తమ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తూ నిరసనకారులు నినాదాలు చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని "క్రైస్తవ సమాజానికి రక్షణ కల్పించాలని" వారు నినదించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల బాధ్యులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి అనేక అనుమానాలకు తావిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిజానిజాలు వెలికి తీయాలని, తద్వారా క్రైస్తవ సమాజానికి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ర్యాలీ అనంతరం నిరసనకారులు కొవ్వొత్తులు వెలిగించి, మౌనంగా పాస్టర్ ప్రవీణ్‌కు శాంతి కలగాలని ప్రార్థించారు. వారు శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కావలి పట్టణంలోని పలు క్రైస్తవ సంఘాల బాధ్యులు, పాస్టర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రవిప్రకాష్‌కు 'దీపం ఉగాది పురస్కారం'

ప్రజాశక్తి-కావలి : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రాష్ట్ర పాలకమండలి సభ్యులు, కావలి శాఖ చైర్మన్ దాకారపు రవిప్రకాష్ "దీపం ఉగాది పురస్కారం" అందుకున్నారు. ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం భవనంలో ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, జిఆర్‌కె-పోలవరపు సాంస్కృతిక సమితి, సుమతి అంతర్జాల తెలుగు మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన దీపం ఉగాది పురస్కారాల ప్రధానోత్సవ సభలో సామాజిక సేవ విభాగంలో కావలికి చెందిన రవిప్రకాష్‌కు ఈ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి డాక్టర్ కె.మన్మథరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, ప్రముఖ చరిత్ర పరిశోధకులు కొంపల్లి సుందర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా రక్తదానం, తలసేమియా ఆస్పత్రి, మరణానంతర సేవలు, యోగ శిక్షణ కేంద్రం తదితర సేవలతో పాటు ప్రకృతి వైపరీత్య బాధితులకు 1999 ఒడిశా సూపర్ సైక్లోన్, 2001 గుజరాత్ భూకంపం, కర్నూల్, కేరళ, చెన్నై వరదలు, విశాఖపట్నం హుదూద్, శ్రీకాకుళం తిత్లీ తుఫాన్ బాధితులకు విశేష సేవలందించిన కావలి రెడ్‌క్రాస్ బృందానికి నాయకత్వం వహించిన రవిప్రకాష్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేసామన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో కృషి చేసిన 34మంది తెలుగు వారికి ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులు తమ్మా శ్రీనివాసులు రెడ్డి, గోళ్ళ నారాయణరావు పాల్గొన్నారు.

చలంచర్ల వాసికి 'కళారత్న' అవార్డు



ప్రజాశక్తి-కావలి : 2025 తెలుగు సంవత్సరాది – శ్రీ విశ్వావసు ఉగాది పర్వదినాన రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకమైన ఉగాది పురస్కారాలలో కావలి మండలం చలంచర్ల గ్రామవాసి దానం అంకయ్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్ చేతుల మీదుగా హంస అవార్డు, కళారత్న బిరుదు, రూ.50 వేల పురస్కార పారితోషికం అందజేశారు. దానం అంకయ్య ప్రపంచంలోనే అతి పెద్దదైన శ్రీ వీరబ్రహ్మం అంకమ్మ కథ చెప్పగలిగిన ఏకైక వ్యక్తి. రోజుకు 3 గంటలు చొప్పున 18 రాత్రులు మొత్తం 54 గంటలు సాగే ఈ కథను దాదాపు 70సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలలో దాదాపు 15 వేల ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కథాగానాన్ని "తెలుగు నెరవు" సంస్థ వారు అక్షర రూపం ఇచ్చి, ఈ కథాగానాన్ని వీడియో రికార్డు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్.మల్లికార్జునరావు ఈ విషయాన్ని గుర్తించి దానం అంకయ్యకు ఈ పురస్కారం ఇప్పించడంతో పాటు పద్మ పురస్కారం, గిన్నిస్ బుక్ రికార్డు నమోదుకు కృషి చేస్తామన్నారు. అంకయ్యను ప్రముఖ అంబేద్కరిస్ట్ డాక్టర్ పివి రత్నం, రెడ్‌క్రాస్ బాధ్యులు డాక్టర్ జెబివాద రవికుమార్, డి.రవిప్రకాష్ అభినందించారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కావలి : కావలి మండలం మద్దూరుపాడు, ఆర్‌కె ధాబా దగ్గరలో నెల్లూరు నుండి ఒంగోలు వైపు పోవు జాతీయ రహదారిపై సుమారు 55–65ఏళ్ల వయస్సు వ్యక్తిని ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని కావలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరచడం జరిగింది. సదరు చనిపోయిన వ్యక్తి తెల్లటి గడ్డం ఉండి, బ్లూ కలర్ చొక్కా, నడుముకు టవల్ చుట్టుకొని ఉన్నాడు. ఆ వ్యక్తిని కావలి పట్టణం మద్దూరు పాడు వాస్తవ్యుడు కొండా వెంకటసుబ్బయ్యగా గుర్తించారు. కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గ్రామోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని జగన్నాధరావుపేటలోని వెలసి ఉన్న పద్మావతి అలమేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలయాన్ని సందర్శించారు. మాజీ జెడ్పి చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు సాగాయి. వేదపండితులు మూలవిరాట్‌కు అభిషేకాలు అనంతరం విశేష అలంకరణ చేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వీధుల్లో భక్తులు పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆ పందిళ్ళ వద్ద భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం విద్యుత్ దీపాలతో వెలుగొందింది. కోలాటాలు, డీజే, పాటలతో, మేళతాళాలతో, బాణాసంచా వేడుకలతో ఊరేగింపుగా గ్రామోత్సవం కొనసాగింది.

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లిములు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆవాజ్ ఉదయగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలను నిరసిస్తూ ముస్లిములు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలో బిజ్జంపల్లిలో మైనారిటీ సోదరులందరూ రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలో నల్ల రిబ్బన్‌లు కట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఇలాంటి పవిత్ర రంజాన్ పండుగ రోజు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపడం చాలా బాధాకరమని వెంటనే వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ అల్లా దీవెనలు ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశామని వారు తెలిపారు. అలాగే భారత దేశ ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు ఇమామ్లు మౌసన్లో ఆవాజ్ కమిటీ సభ్యులు, ముస్లిములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలో రంజాన్ పండుగ ఈద్ నమాజ్ చదువుకొన్న తర్వాత ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఈద్గా నుండి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉండే బిజెపి ప్రభుత్వం వక్ఫ్ భూములను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు అప్పగించడానికి వక్ఫ్ చట్టం అడ్డంగా ఉన్నది కావున ఉన్న చట్టాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో రైల్వే తర్వాత అధిక ఆస్తులు ఉన్నది కేవలం వక్ఫ్‌బోర్డుకు ఉన్నదన్నారు. మసీదులకు, మద్రసలకు, ఈద్గాలకు, దర్గాలకు ఆస్తులు, భూములను అనేక మంది వక్ఫ్ (దానం) ఇచ్చారని వాటిని లాగుకొనే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ చేస్తుందన్నారు. ఈ దేశం లౌకికదేశం కావున అన్నిమతాలు సామరస్యం తో ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మైనారిటీలపై జరిగే దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యు లు అన్వర్ బాషా, ఆవాజ్ కమిటి మండల అధ్యక్షులు సయ్యద్ ఇఫ్తిఖర్ అహ్మద్, మండల కార్యదర్శి సలీం, ముస్లిం మైనారిటీ నాయకులు ఖాసిం బాషా, గడ్డం సర్దార్, ఖాజామొహిద్దీన్, రబ్బానీ, రసూల్, రహం తుల్లా, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

మంచినీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి

సీతారాంపురం మండలం పడమటి రొంపిదొడ్ల గ్రామంలో తాగునీరు అందించాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి కోడే.రమణయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు రోడ్డెక్కారు. ఈ సందర్భంగా పడమటి రొంపిదొడ్ల గ్రామ ప్రజలు ఆవేదనను సిపిఎం నాయకులు కోడే రమణయ్యకు తెలపటంతో ఆయన మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు నోచుకోక, వారం రోజులుగా నీళ్లు లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా మూగ జీవాలపై ఎక్కువమంది గ్రామ ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వాటి రోదన చూడలేకపోతున్నామని మూగ జీవాల యాజమానులు వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వేసవికాలం దృష్ట్యా ప్రధానమైన మంచినీటి పథకాన్నికి మరమ్మతులు చేయించి మంచి నీటి సౌకర్యం కల్పించి ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో గ్రామ ప్రజలతో మండల కార్యాలయాలు వద్ద ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వై వి సుబ్బారెడ్డికి రామిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-బిట్రగుంట : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత వై.వి.సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఇటీవల మరణించినందున ఒంగోలులోని వై.వి. సుబ్బారెడ్డి నివాసంలో పిచ్చమ్మ ఉత్తర క్రియలలో మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి లేని లోటు ఆ కుటుంబానికి ఎవరు తీర్చలేని లోటు అని తెలిపారు. ఆయనతో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పముజుల దశరథరామయ్య

అక్రమ లేఅవుట్లను తొలగించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు రూరల్ మండలంలోని ప్రభుత్వ భూములలో కొందరు ఆక్రమణదారులు అక్రమ లేఅవుట్ వేసి వాటిని అమ్ముకుంటూ కోట్ల రూపాయలకు పడగలెత్తుతున్నారని సిపిఐ నేత పముజుల దశరథరామయ్య ఆరోపించారు. ఈ సందర్భంగా సౌత్‌మోపూరులోని ఆయన స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మట్టెం పాడు గ్రామంలో యేళ్ల తరబడి, భూవివాదాలు జరుగుతున్నాయని, కోర్టులో కూడా కేసులు నడుస్తున్నాయని ఆ భూముల్లో కొందరు లేఅవుట్‌లు లేసి అమ్ముతున్నారని తెలిపారు. ప్రధానంగా ఆ గ్రామంలో లేఅవుట్లను ప్రభుత్వ అధికారులు మరోసారి పరిశీలించి, వాటికి అనుమతులు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. తమకు ఉన్న సమాచారంతో జిల్లా కలెక్టర్ వారిని కలిసి ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న లేఅవుట్ నిర్వహించిన వాటిని రద్దు పరిచి, ఆ యాజమానిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతామని తెలిపారు. అధికారుల స్పందన లేని పక్షంలో ప్రభుత్వ భూముల్లో ఉన్న లేఅవుట్‌లపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలియజేస్తున్నా మన్నారు. ప్రజలు కూడా అన్ని రకాలుగా పరిశీలించి ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు ఉన్న, లేఅవుట్‌లలో మాత్రమే కొనుగోలు చేయగలరని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ, చేనేత జిల్లా కార్యదర్శి పముజుల హరి, కండి శివయ్య, పముజల గోపాలయ్య, రామయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్కూల్ ఏర్పాటుపై పరిశీలన

ప్రజాశక్తి-సంగం

సంగం లోని పాత చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఎస్‌సి కాలనీలో అంగన్‌వాడీ స్కూల్ ఏర్పాటుపై ఐసిడిఎస్ పీడీ నిర్మలా దేవి, డిప్యూటీ డిఇఒ జానకీరామ్ పర్యటించారు. తమ కాలనీలో అంగన్‌వాడీ పాఠశాల కావాలంటూ ఇటీవల పర్యటనకు వచ్చిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి కాలనీ వాసులు వినతిపత్రం సమర్పించారు. మంత్రి ఆనం ఆదేశాలతో అధికారులు పరిశీలించారు. మినీ అంగన్‌వాడీ పాఠశాల, ప్రీ స్కూల్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన విద్యార్థులు ఉన్నారా.. లేదా.. అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అవసరమైన బిల్డింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో పరిశీలించినట్లు తెలిపారు. కాలనీలో మినీ అంగన్‌వాడీ పాఠశాల, ప్రీ స్కూల్ ఏర్పాటుకు అనువుగా ఉందని, ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సునీలత, సూపర్‌వైజర్ పద్మావతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వాకింగ్‌తో ఆరోగ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రతిరోజు తప్పనిసరిగా వాకింగ్ చేయాలని బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు పేర్కొన్నారు. బిట్రగుంట వాకర్ అసోసియేషన్ క్రీడా మైదానంలో ఆదివారం సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన ట్రీట్‌లో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్జన్ రాజ్, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ కుందుర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మారుతున్న కాలాన్ని బట్టి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజుకు 30నిమిషాల పాటు వాకింగ్ చేయడం అవసరమని, ఆరోగ్యంగా జీవించడం కోసం ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రోగాలు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పి.జీవన్ కుమార్, జిలాని, జనార్ధన్, మురళి, శేఖర్‌బాబు, శ్యాంసుందర్, సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వర్లు, ఏనుగుల ప్రభాకర్ రెడ్డి, సుబ్బరాయుడు, ప్రభావతి, ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ లు గోపిశెట్టి శ్రీ హరిబాబు, మనోహర్ నాయుడు, రాజన్, అశోక్, తదితరులున్నారు.

పలుచోట్ల రంజాన్ వేడుకలు

కావలిలో...

ప్రజాశక్తి-కావలి : రంజాన్ పర్వదినం సందర్భంగా ఆదివారం కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కావలి పట్టణం రైల్వే రోడ్ జమియా మసీదు, వైకుంఠపురం మదీనా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదర, సోదరీ మణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ, కరుణ, ఐకమత్యం సందేశాలతో సేవాతత్పరత, ఆధ్యాత్మికత వెల్లివిరిసే ఈద్ ఉల్ ఫితర్ పర్వదినం సందర్భంగా అల్లా కరుణా కటాక్షాలు అందరిపైన ఉండాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని నెల రోజులు ఉపవాసాలు ఉన్న ముస్లిం సోదరులు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆళింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముస్లిం మతపెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. విస్తారంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ వెలసి ఉన్న ఎఎస్‌పేట దర్గా ప్రాంతంలో నెలరోజులుగా ముస్లిముల పవిత్ర మాసమైన రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న మైనారిటీలకు జనసేన మండల అధ్యక్షులు సయ్యద్ అక్బర్‌బాషా, ఆత్మకూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు చదలవాడ హరీష్ కుమార్ వారి సహకారంతో సుమారు 150 మందికి పైగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆ పార్టీకి చెందిన సంఘం మండల సీనియర్ నాయకులు భాను కిరణ్, ఆత్మకూరు ఐటీ కోఆర్డినేటర్ పులిపాటి అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, సంగం టౌన్ నాయకులు అనిల్, గుంజి జయరాజ్, భాను చంద్ర, కాజా నవాజ్, ఆరిఫ్, చందారెడ్డి ఉన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : రంజాన్ పర్వదినం సందర్భంగా బోగోలు పంచాయతీ, విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని జామియానా మసీదులో సోమవారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిట్రగుంట అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ నూరుద్దీన్ మాట్లాడుతూ ప్రేమ, దయ, సహనం, సంతోషాల కలయికే రంజాన్ మాసం అని తెలిపారు. ముస్లిం సోదరులందరికీ ఈద్–ఉల్–ఫితర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లా శాంతి, శ్రేయస్సును ప్రసాదించాలన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండలంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. సంగం గ్రామంలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముభారక్ చెప్పుకున్నారు. నిరుపేదలకు నగదును, భోజనం పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కావలి ఎడవల్లి గ్రామపంచాయతీలో ఆ గ్రామ టిడిపి నాయకులు మాజీ తెలుగు యువత అధ్యక్షులు ఏలూరి మాల్యాద్రి నాయుడు తన సొంత నిధులతో 10 కుటుంబాలకు రంజాన్ తోఫా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా రంజాన్ పండుగ పురస్కరించుకొని, రంజాన్ తోఫా అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని మైనారిటీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ముప్పూరి ధనమ్మ, వార్డ్ మెంబర్ మన్నం మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ స్వాముల వారి దర్గా వద్ద ఉన్న మసీదులో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక షామియానాలు, ప్రార్థనలకు అనుకూలంగా ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని నలుమూలల నుంచి మైనార్టీ సోదరులు ఈద్–ఉల్–ఫితర్ నమాజ్ చదివి, తదనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ అనంతరము ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ నెల రోజులు సంపూర్తిగా ఉపవాస దీక్ష చేయడం వలన, శరీరం, మనసు ఎంతో పరిపుష్టని సంతరించుకుంటుందని, ఆరోగ్య పరమైన సమస్యలు ఏమైనా ఉంటే అవి తొలగిపోతాయని తెలియజేశారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రంజాన్ సందర్భంగా నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం సోమవారం రంజాన్ పండుగను ముస్లిములు ఆనందంతో జరుపుకున్నారు. ఉదయం 9 గంటల సమయంలో పట్టణంలోని ముస్లిం సోదరులు సత్రం సెంటర్ వద్ద ముస్లిం సోదరులు కలుసుకొని బిఎస్ఆర్ సెంటర్ వద్ద ఉన్న ఈద్గా మైదానం వద్దకు చేరుకున్నారు. అక్కడ మౌజమ్‌లు, ఇమామ్‌లు, ఖురాన్ గ్రంథంలోని పలు సూక్తులను వివరించారు. రంజాన్ పండుగ విశిష్టతను తెలిపి మహమ్మద్ ప్రవక్త గడిపిన జీవితాన్ని వివరించారు. సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిములు ఒకరినొకరు అలింగణం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనలు అనంతరం ముస్లింలు పేదలకు తమకు తోచిన మేర ధన సహాయం చేశారు. బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేశారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పలు మసీదులలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణ ప్రాంతంలోని ముస్లిం సోదరులు నెలరోజుల ఉపవాస దీక్షను విరమించుకొని రంజాన్ సందర్భంగా పలు మసీదులలో సాంప్రదాయ వస్త్రాలతో అధిక సంఖ్యలో మసీదుల వద్దకు చేరుకొని నమాజును ఆచరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రంజాన్ విశిష్టతను మత పెద్దలు ముస్లిం సోదరులకు వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడు లో సోమవారం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 10 గంటలకు ఉలవపాడు లోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు అందరూ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ రంజాన్ పండుగ పవిత్రను, ఉపవాసాల గురించి తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని వాడవాడల రంజాన్ వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు జరుపుకొన్నారు. అందులో భాగంగానే పోతిరెడ్డిపాలెంలో గ్రామంలో రంజాన్ పండగ సందర్భంగా, ఈద్గాలో నమాజు, ప్రార్థనలు నిర్వహించారు. స్వయంగా తిరుమూర్ అశోక్ రెడ్డి, ఎంపిటిసి ఎద్దులపూడి నాగరాజు నమాజ్‌కు మరి ప్రార్థనలలో పాల్గొన్నారు. వారిరువురిని, మైనార్టీ నాయకులు, మైనార్టీ సోదరులు, వాళ్లను ఘనంగా స్వాగతించారు. ప్రార్థన అనంతరం అశోక్ రెడ్డి మాట్లాడుతూ మైనార్టీలు ఉద్దేశించి, అల్లా దయతో, ఊరి మొత్తం ప్రజలు, మీరు, అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో, కుల మతాలకు అతీతంగా సోదరభావం కలిగి ఉండాలన్నారు. ముతుపల్లి షేక్ షఫీ అహ్మద్, షేక్ వహీద్, జాకీరు సోదరులు, బబులు, అబూబక్ర్ సిద్ధిక్, సర్జికల్ షఫీ, మరి ఫారుకు, ఎమ్మెస్సార్ మన్సూర్, మహబూబ్ల, వాణి కాలనీ అహ్మద్, ఇస్మాయిల్ భాయ్, మస్తాన్ భాయ్, మాబాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : పవిత్ర రంజాన్ వేడుకల్లో భాగంగా సీతారామపురంలోని బస్టాండ్ సెంటర్ మసీదులో ముస్లిం సోదరులకు తన సేన కోసం తన వంతు రాష్ట్ర కమిటీ మెంబర్, జనసేన నియోజకవర్గ నాయకుడు బోగినేని కాశీరావు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఎంఎల్ఎ స్వయంగా వడ్డించారు. అనంతరం ముస్లిం మతపెద్దల నుండి పలు విజ్ఞప్తులను స్వీకరించి వారితో చర్చించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో దుకాణదారులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పెద్ద గౌస్, ఖాజా మొహిద్దీన్, బాబు, భాషా మండల టిడిపి కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, జనసేన మండల నాయకుడు భోగినేని గాంధీ, జనసేన మహిళ నాయకురాలు భోగినేని సులోచనమ్మ, టిడిపి నాయకులు గాజులపల్లి చంద్రారెడ్డి, వెంగళశెట్టి వెంకటే శ్వర్లు, చెన్నకేశవులు, దేవర వెంకటేశ్వర్లు, వికాస్‌బాబు, సింగాల నాగేష్, ఎస్. రాజా, జాషువా, ఇజ్రా యిల్, ఆలూరు సుబ్బయ్య, పిడుగు రమేష్, ఆదయ్య, తోకల రామచంద్ర, సుమన్, రఘురామయ్య, ఆలూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వినిపురంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గం టిడిపి యువ నాయకులు వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నువ్వురుపాడు పంచాయతీ మజరా అశ్వినిపురం గ్రామంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ అందించారు. ముస్లిం సోదరులు ఉపవాసాలు అనంతరం దీక్ష విరమించే సమయంలో గ్రామంలోని మసీదులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ కోసం బిర్యాని ప్యాకెట్లను అందించారు. మసీదు మౌలానా హఫీజ్ మహమూద్ ఆధ్వర్యంలో షేక్ హుస్సేన్, షేక్ ఖాసిం బాబా, షేక్ బాదుల్లా, షేక్ మహీద్, ఇతర ముస్లిం సోదరులు పాల్గొనగా ఉపవాస దీక్ష ముస్లిం సోదరులకు ఇఫ్తార్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డితో పాటు మెట్టుకూరు భరత్ కుమార్ రెడ్డి, ఈగ భరత్ కుమార్ రెడ్డి గ్రామ ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యతఉన్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఉంటూ చివరిరోజైనా ఆదివారం ఉపవాసాన్ని ముగించుకున్న సమయంలో ఉపవాస దీక్షను ముగించిన సమయంలో వారికి ఇఫ్తార్ ఆహారాన్ని అందించినందుకు తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. నెల రోజులపాటు ఉపవాసాలు ఉన్న ముస్లిం సోదరులకు ఆ అల్లా దూవ, దీవెనలు అందించాలని అందరు సుఖసంతోషాలతో ఉండాలని తెలుపుతూ ఈ సందర్భంగా రంజాన్ పండగ పురస్కరించుకొని గ్రామ ముస్లిం సోదరులకు నియోజకవర్గ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామ ముస్లిం సోదరులు ఇఫ్తార్ అందించిన సుదర్శన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ముస్లిముల సంక్షేమానికి కృషి



ప్రజాశక్తి-ఉదయగిరి : ముస్లిం సోదరుల అభివృద్ధి సంక్షేమానికి ఉదయగిరి కోటను పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుతానని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కృషి చేస్తానని పేర్కొన్నారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయగిరిలోని ఈద్గా మసీదులో జరిగిన రంజాన్ ఈద్ – ఉల్ – పీతర్ సమాజ్ ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులను అలింగణం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సర్వమత ఐకమత్యం సద్భావన సర్వ మానవ సమతకు ప్రతీక రంజాన్ పర్వదినం అని తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం అంతా ముస్లిం సోదరులందరూ నెల రోజులపాటు నియమ నిష్టలతో కఠోర ఉపవాస దీక్షలతో అల్లాహ్ ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగించడం గొప్ప విషయమన్నారు. ప్రతిఒక్కరూ ఉన్న దానిలో ఎంతో కొంత సహాయం చేస్తూ సేవా దృక్పథాన్ని చాటుతూ రంజాన్ పండుగను జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచలబాబు యాదవ్, మండల అధ్యక్షులు బయన్న, మైనార్టీ నాయకులు రియాజ్, యువ నాయకులు సంధాని, గాజుల బాబు, నాయకులు వెంకటేశ్వర్లు, మధు, మసీదు మత పెద్దలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ సమర్ధవంతంగా పని చేయాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని టిడిపి మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ఎక్సైజ్ శాఖ అధికారులతో సమర్థవంతంగా పనిచేయాలని, పేట మండలంలోని ఏ గ్రామాల్లో కూడా ఒక్క బెల్ట్‌షాపు లేకుండా చూడాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్సైజ్ సిఐతో మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలోనూ కనీసం రెండు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని, అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కనీసం ఫోన్ చేసినా కూడా మీరు లిఫ్ట్ చేయడం లేదని, తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలకు ఎక్సైజ్ సిఐ మేడం స్పందిస్తూ తనకు నాలుగైదు మండలాలు ఉన్నాయని, అయినప్పటికీ మండలంలో ఎక్కడ ఒక్క బెల్ట్‌షాపు కూడా లేకుండా విస్తృతంగా తనిఖీలు చేపడతామని, ఎక్కడ బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న తమకు కాల్ చేసిన వెంటనే స్పందిస్తామని ఆమె తెలియజేశారు. ఎవరు ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని, ఎఎస్‌పేట మండలంలో ప్రత్యేక నిఘ ఏర్పాటు చేస్తామని, బెల్ట్‌షాపు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని, కేసులు పెడతామని తెలియజేశారు.

గిరినాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజక వర్గ టిడిపి సీనియర్ నాయకులు, కిమ్స్ హాస్పిటల్స్ ఎమ్‌డి తాళ్లూరు గిరినాయుడు జన్మదిన సందర్భంగా ఆయన స్వగృహంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి మండలం అధ్యక్షులు, సుంకం పెంచల చౌదరి ప్రధాన కార్యదర్శి, కేత విజయ భాస్కర్ రెడ్డి తెలుగు జిల్లా ఉపాధ్యక్షులు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు తమ్ముడు శీను తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింటు **మండువ లింగేశ్వర ప్రసాద్,** తండ్రి **వెంకటేశ్వర్లు,** త్రోవగుంట గ్రామము మరియు మండలము, ప్రకాశం జిల్లా వారి సంజాయిషీ మేరకు ఇచ్చిన నోటీసు. నా **ఆధార్ నెం.564825428215.** నేను **తే06-04-2005దిన డాక్యుమెంటు నెం.870/2005** క్రింద **స.నెం.276/3O** లోని **242 చ.గల స్థలము** కొనుగోలు చేసినాను. అప్పుడు నాకు స్థలం విక్రయించిన **తొట్టెంపూడి కోటేశ్వరరావు,** తండ్రి **నాగేశ్వరరావు,** అతను కొనుగోలు చేసిన **లింకు డాక్యుమెంటు నెం.219/2005** ఇచ్చినారు కావున నాకు ముట్టినది. సదరు డాక్యుమెంటు **తే29-03-2025ది** సాయంత్రం ఆర్‌టిసి బస్టాండు, కందుకూరు నందు పోయినది. ఎంతవెతికినా కనిపించలేదు. దొరికినవారు **మొబైల్ నెం.8639979787, 9989911657** కు తెలియజేయగలరు.

ఇట్లు
బి. సాయిశంకర్
అడ్వకేట్, కందుకూరు.

In The Court of The Principal Civil Judge (Junior Division), Kavali.
O.S.No : 302/2021

Between :
DevallaSeenaiah - Plaintiff
Vs
Pallapu Narayana - Defendent

To,
Pallapu Narayana, S/o **Ramanaiah,**
Mastry, Sand Bussiness, D. No. 3-371,
Near Ramalayam Temple Vaddepalem,
Chamadala,(V), Jaladanki (M).
SPSR Nellore (Dist). Cell No.**9989122775**

అను ప్రతి వాదికి దావా నోటీసు

ఈ నంబరున వాది తనకు రావలిసిన ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం ప్రతివాది అగు మీపై ఈ నంబరున దావా దాఖలు చేసుకొని ఉన్నందున పై కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం వాయిదా **తేది: 25-04-2025**కి వేసివున్నారు. కావున మీరు ఆ దినం **పగలు 10.30.గం॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరుగాని, మీ వకీలు ద్వారాగాని హాజరై, మీకుగల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది : **25-04-2025.**

ఇట్లు,
ఎం.జాకిర్ హుస్సేన్,
వాది తరుపున్యాయవాది, కావలి.